క్లుప్తంగా

29న జాబ్‌మేళా

నిర్మల్‌రూరల్: 2023–24లో ఇంటర్ పాసైన విద్యార్థులకు ఈనెల 29న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీఐఈవో పరశురాం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ఫార్మా కంపెనీ హెటిరో ల్యాబ్స్‌లో టెక్నికల్ ట్రైనింగ్ పోస్టుల కోసం ఎంపిక ఉంటుందన్నారు. బైపీసీ లేదా ఎంపీసీ, ఫార్మా, ఎంఎల్‌టీ బ్రిడ్జికోర్సు పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు. పదోతరగతిలో 60 శాతం, ఇంటర్‌లో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, ఎంపికైన అభ్యర్థులను బీఎస్సీ డిగ్రీ చదివిస్తూ టెక్నికల్ ట్రైనింగ్ ఇస్తారన్నారు. శిక్షణలో నెలకు రూ.12,500 స్టైఫండ్, మొదటి రెండు సంవత్సరాలు ఉచిత వసతి ఉంటుందన్నారు. వివరాలకు 6303204295 నంబరులో సంప్రదించాలని సూచించారు.

'అర్హులకే కేంద్రం అప్పగిస్తాం'



మాట్లాడుతున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి

లోకేశ్వరం: అర్హులకే ధాన్యం కొనుగోలు కేంద్రం అప్పగిస్తామని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నారు. తమకు కొనుగోలు కేంద్రం బాధ్యతలు అప్పగించాలని మండలంలోని కనకాపూర్ ఐకేపీ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్డీవో గురువారం గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. వారి వెంట తహసీల్దార్ మోతీరాం, మహిళా సంఘాల సభ్యులు తదితరులు ఉన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

నర్సాపూర్(జి): రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని ఎంపీఓ తిరుపతిరెడ్డి హెచ్చరించారు. గురువారం మండలకేంద్రంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈసందర్భంగా హోటళ్లు, దుకాణాల యజమానులకు పలు సూచనలు చేశారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త పడేయకుండా చెత్తకుండీలను ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్ ఉన్నారు.

'జీవో 29 రద్దు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్

కడెం: జీవో నం.29ను రద్దు చేయాలని నేతకాని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గె వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. పోటీ పరీక్షల్లో ర్యాంక్ సాధించిన వారికి ఓపెన్‌కోటాలో .. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు తమ కోటా ప్రకారం అవకాశం కల్పించాలని కోరారు. ఓసీలకు మేలు చేసే ఈ జీవోను రద్దు చేయాలని పేర్కొన్నారు. మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ల రమేశ్, గంగాధర్, జోసెఫ్, లక్ష్మణ్ తదితరులున్నారు.

అందుబాటులో శనగ విత్తనాలు

కుంటాల: రబీ సీజన్‌లో సాగు చేసేందుకు కుంటాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనంలో శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, సీఈవో నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. 25 కేజీల బస్తా ధర 2,250 ఉందని.. కావాల్సిన రైతులు శుక్రవారం నుంచి విత్తనాలను తీసుకెళ్లాలని వారు కోరారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

నర్సాపూర్(జి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ పంటను విక్రయించి మద్దతు ధర పొందాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలోని పెద్దహనుమాన్ ఆలయ ఆవరణలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. చిన్న రామయ్య, రాంరెడ్డి, నిర్మల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీమ్, రమేశ్, ఫసి, గంగారెడ్డి, గాదె సంతోష్, ఏవో రాంచందర్‌నాయక్, ఏఈఓ గణేశ్, రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఆలయాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం'

నిర్మల్‌చైన్‌గేట్: ఆలయాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సిగ్గుచేటని మెడిసెమ్మె రాజు అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం నిర్మల్‌లోని మంచిర్యాల చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ ప్రతి మను ధ్వంసం చేసిన దుండగుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. సామనపల్లి రాఘవులు, గ జవాడ కపాల్, కటకం అశోక్, శిల్ప సంతోష్, శ్రీనివాస్, సురేందర్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్లపై పంటను ఆరబెట్టవద్దు

కుంటాల: మండలంలోని రైతులు రోడ్లపై వరి, సోయా, మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబెట్ట వద్దని ఎస్సై భాస్కరాచారి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆరబోసిన పంటకుప్పలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్తున్నారన్నారు. పంటకుప్పల చుట్టూ బండరాళ్లను పెట్టడం ద్వారా రాత్రి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని పేర్కొన్నారు.

పరేషాన్‌లో పత్తి రైతులు

- వాడిపోతున్న మొక్కలు
- తగ్గుతున్న దిగుబడులు
- పెట్టుబడులు కూడా వచ్చేలా లేవంటున్న కర్షకులు



కుభీర్‌లో ఎర్రబడిన పత్తి మొక్కలు

కుభీర్: తెల్లబంగారంగా పిలుచుకునే పత్తి పంట కుభీర్ మండలంలోని రైతులను ముంచుతోంది. ఓ వైపు నీరు లేక.. మరోవైపు పొగమంచు కారణంగా ఇటుకరోగం సోకి మొక్కలు వాడిపోతున్నాయి. దీంతో కనీస దిగుబడులు రావడం లేదు. ఒక మొక్కకు 30 నుంచి 50 వరకు కాయలు ఉండాలి.. కానీ ఈ మండలంలోని పత్తి చేన్లలో ఒక్కో మొక్కకు 15 కాయలకు మించి ఉండటం లేదు. మార్కెట్‌లోనూ గిట్టుబాటు ధర అందడం లేదని.. పెట్టిన పెట్టుబడులు వస్తాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కుభీర్ మండలంలో..

ఈ ఖరీఫ్‌లో కుభీర్ మండలంలో 35 వేల ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. సుమారు నాలుగు వేల ఎకరాల పంటకే నీటి సౌకర్యం ఉంది. నీటి వసతి కల్గిన రైతులు నీళ్లు అందించి చేన్లకు కాపాడుకుంటున్నారు. మిగతా చోట్ల పత్తి, పూత, కాత దశలో వర్షాలు పడకపోవడంతో ఆకులు ఎర్రబారి రాలిపోతున్నాయి. గిరిజన తండాలలో పరిస్థితి దారుణంగా ఉంది. సిర్పెల్లి, రంజని, దొడర్నా, బెల్గాం, మార్లగొండ, శివని తదితర తండాల్లో పత్తిని ఒకసారి ఏరి(సేకరించి) మొక్కలను తొలగించేందుకు ఎదురు చూస్తున్నారు. ఎకరాకు మూడు, నాలుగు క్వింటాళ్లకు మించి దిగుబడి రావడం లేదు. మైదాన గ్రామాల్లో ఎకరాకు 6 నుంచి 7 క్వింటాళ్లు మాత్రమే వచ్చే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

గిట్టుబాటు ధర లేదు..

పండిన పంటకు గిట్టుబాటు ధరలు లేవు. దుక్కి దున్నడం మొదలుకొని.. పత్తి తీసే వరకు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, కలుపుతీత, రసాయన మందుల పిచికారీకి ఎకరాకు పెట్టుబడి రూ.10వేలకు పైనే అవుతుందని.. రైతులు పేర్కొంటున్నారు. ఈనెల 12న కుభీర్‌లో ప్రైవేటులో పత్తి కొనుగోళ్లు ప్రారంభం కాగా క్వింటాలుకు కేవలం రూ.6850 మాత్రమే అందించారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.7521 అందిస్తున్నా.. సీసీఐ వారు ఇప్పటికీ కొనుగోళ్లు ప్రారంభించలేదు. అసలే దిగుబడి లేకపోవడం.. ఉన్న పంటకు ధర తక్కువ ఉండటంతో రైతులు మార్కెట్‌కు పత్తిని తీసుకురావడం లేదు. కొందరు రైతులు కూలీలకు చెల్లింపులతోపాటు ఇతర అవసరాల నిమిత్తం తక్కువ ధరకే ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకొని నష్టపోతున్నారు.

నీటిని అందించాలి

పత్తి పంట కాలం 60 రోజులు దాటింది. ఇప్పుడేం చేయలేం. పొగమంచు కారణంగా మొక్క ఆకులు వాడిపోతున్నాయి. పత్తి చేన్లకు నీటిని అందిస్తే రాలిపోయిన ఆకుల స్థానంలో మళ్లీ చిగురించే అవకాశం ఉంది.

– వీణ, భైంసా ఏడీఏ

పంట ఆశాజనకంగా లేదు



ఈసారి పత్తి పంట ఆశాజనకంగా లేదు. దిగుబడి రావడం లేదు. మద్దతు ధర కూడా అంతంతమాత్రమే. మూడెకరాల్లో పత్తి పంట సాగు చేశా. పెట్టుబడులు రూ.20వేలు దాటాయి. 9 క్వింటాళ్ల పంట చేతికొచ్చింది. మరో మూడు క్వింటాళ్ల వరకు వచ్చే అవకాశం ఉంది.

– పిట్ల దత్తాత్రి, కుభీర్

పెట్టుబడులు వచ్చేలా లేవు



నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశా. పెట్టుబడులు రూ.30 వేలయ్యాయి. ఇప్పటివరకు 12 క్వింటాళ్ల పత్తి వచ్చింది. మరో 12 క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉంది. పెట్టుబడులు వచ్చేలా లేవని ఆందోళన చెందుతున్నాం.

– సుంకరి సాయినాథ్, సార్డి(కె)

పోలీస్‌స్టేషన్లలో ఓపెన్‌హౌస్

నిర్మల్‌రూరల్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ నిర్వహించారు. ఈసందర్భంగా నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి విద్యార్థులకు ఆయుధాల వినియోగం, బాంబు డిస్పోజల్ సామగ్రి, జాగిలాల ప్రదర్శనపై అవగాహన కల్పించారు. పోలీసుల సేవలు, షీటీం, ట్రాఫిక్, యాంటీ నార్కోటిక్ డ్రగ్ విభాగాల పనితీరు వివరించారు. ఆపదలో విద్యార్థులు 100కు డయల్ చేయాలన్నారు. రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై లింబాద్రి, విజయ హైస్కూల్, ప్రిన్స్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆయుధాల గురించి వివరిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

ముధోల్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం ముధోల్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులకు ఆయుధాల వినియోగం, పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సీఐ మల్లేశ్, ఎస్సై సాయికిరణ్, సిబ్బంది తదితరులున్నారు.



ముధోల్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ప్రణాళికతో పరీక్షలకు సిద్ధం కావాలి

లోకేశ్వరం: ప్రణాళికాబద్ధంగా వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని జిల్లా మాధ్యమిక విద్య అధికారి జాదవ్ పరశురాంనాయక్ విద్యార్థులకు సూచించారు. లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం తనిఖీ చేశారు. తరగతి గదులు, రికార్డులు పరిశీలించారు. సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. విద్యార్థి జీవితంలో ఇంటర్ విద్య కీలకమన్నారు. క్రమం తప్పకుండా కళాశాలకు హాజరై అధ్యాపకుల పాఠాలు వింటూ సందేహాలు నివృత్తి చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి జీవితంలో లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఉన్నతస్థానంలో స్థిరపడాలన్నారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై పలు సూచనలు చేశారు. విద్యార్థుల హాజరుశాతం పెంచాలన్నారు. వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ గౌతమ్, అధ్యాపకులు ప్రమీల, శ్రీనివాస్, నవీన్, చిన్నయ్య, మహేందర్, సాయినాథ్, హరీశ్ ఉన్నారు.



మాట్లాడుతున్న డీఐఈవో పరశురాంనాయక్

సంక్షిప్త వార్తలు

సాయిబాబా ఆలయంలో పూజలు

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు వచ్చి మధ్యాహ్న హారతిలో పాల్గొని బాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

చెట్టును తొలగించిన పోలీసులు

కుంటాల: మండలంలోని కల్లూర్ నుంచి కుంటాల వెళ్లే రోడ్డుపై అందాకూర్ సమీపంలో రోడ్డుపై చెట్టు పడిపోయింది. అటు వైపు వెళ్తున్న పోలీసులు గమనించి ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చెట్టును తొలగించారు. ఏఎస్సైలు రాందాస్, దేవరావు, సిబ్బంది ఉన్నారు.

విద్య, వైద్యానికే కాంగ్రెస్ ప్రాధాన్యం

ముధోల్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి తొలి ప్రాధాన్యమిస్తుందని ఆ పార్టీ నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, పతంగి కిషన్ పేర్కొన్నారు. గురువారం వారు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ముధోల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, మంత్రి సీతక్క ఎంతో కృషి చేశారన్నారు. ప్రారంభోత్సవంలో జరిగిన తప్పులపై తాము మౌనంగా ఉన్నామని.. తమకు అభివృద్ధే ముఖ్యమన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. డిగ్రీ కాలేజీ వద్ద రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు అజిత్, తదితరులున్నారు.

'వాటర్ ప్లాంట్ నిర్మాణం నిలిపివేయాలి'

పెంబి: మండలంలోని ఇటిక్యాల్ గ్రామంలో అనుమతుల లేకుండా చేపట్టిన వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులను నిలిపివేయాలని కొన్నిరోజుల కిందట అదనపు కలెక్టర్‌కు విన్నవించిన విషయం తెలిసిందే. గురువారం వాటర్ ప్లాంట్ నిర్మిస్తున్న యజమానులను గ్రామానికి పిలిపించారు. వీడీసీ సమావేశం ఏర్పాటు చేసి ప్లాంట్ పనులు నిలిపివేయాలని కోరారు. ఇందులో వీడీసీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

సారంగాపూర్: మండలంలోని రాంసింగ్‌తండాలో చౌహాన్ ఈనేష్‌కు చెందిన 60గొర్రెలు ఇటీవల పిడుగుపాటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం బాధిత కుటుంబాన్ని మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, పరామర్శించారు. ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. రూ.5వేలను సాయంగా అందించారు. వారి వెంట రాజేశ్వర్, దత్తురాం, పోతారెడ్డి, బొల్లోజి నర్సయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

చిన్నారులకు వైద్యపరీక్షలు

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎత్తుకు తగిన బరువు లేని చిన్నారులను వైద్యులు విశ్వేశ్వర్, విగ్నేశ్ పరీక్షించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని తల్లులకు, అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద, పీహెచ్‌ఎన్ దుర్గాభవాని, ఏఎన్‌ఎంలు సక్కుబాయి, శకుంతల, కరుణ, టీచర్లు పాల్గొన్నారు.

కరీంకాలనీలో బోరు ఏర్పాటు

ఖానాపూర్: పట్టణంలోని ఐదో వార్డు పరిధిలోని ఇంద్రనగర్ కాలనీలో నూతన బోరు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం సహకారంతో మున్సిపల్ నిధుల నుంచి బోరు ఏర్పాటు చేసినట్లు కౌన్సిలర్ పరిమిలతసురేశ్ తెలిపారు. ఉమర్, వాసేఖాన్, గణేశ్, ఫైసల్, ఫేరోజ్, అతాఉల్లా, సాదిక్, చాంద్, నవీన్, శంషుద్దీన్, హమీద్, తదితరులున్నారు.

గ్రంథాలయం ప్రారంభం

పెంబి: ప్రభుత్వ పాఠశాలల్లో రూం టూ రీడ్ కార్యక్రమంతో విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు మెరుగవుతాయని ఎంపీడీవో రమాకాంత్, తహసీల్దార్ లక్ష్మణ్ అన్నారు. గురువారం పెంబి ప్రాథమిక పాఠశాలలో రూం టూ రీడ్ ఆధ్వర్యంలో గ్రంథాలయాన్ని ప్రారంభించారు. మండల సమన్వయ కర్త రాజేందర్, ఎంఈవో రాంచందర్, ఎస్సై సాయికుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

బీఎల్‌ఓలకు అవగాహన

నర్సాపూర్(జి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓలతో తహసీల్దార్ శ్రీనివాస్ సమావేశం ఏర్పాటు చేశారు. ఓటరుగా పేరు నమోదు చేసుకున్న వారి వివరాలను ఫోన్ ద్వారా వెరిఫికేషన్ చేయాలని సూచించారు. మండలంలో ఇప్పటివరకు 212 మంది పట్టభద్రులు, ఒక టీచర్ ఆన్‌లైన్‌లో ఓటు హక్కుకు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. తమ కార్యాలయంలో ఓటరు నమోదుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని.. నవంబర్ 2021 లోపు డిగ్రీ పూర్తి చేసుకున్న వారు అర్హులని తెలిపారు. కార్యక్రమంలో డీటీ వాహిదొద్దీన్, ఆర్ఐ వేణుగోపాల్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు

ఓటుహక్కు నమోదు

కుంటాల: ఓటుతోనే పాత పెన్షన్ విధానం సాధిద్దామని సీపీఎస్ ఉద్యోగుల జిల్లా సంఘం అధ్యక్షుడు కె.కృష్ణారావు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గురువారం కుంటాల ఆదర్శ పాఠశాలలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులతో ఓటుహక్కు నమోదు చేయించారు. ఆదర్శ పాఠశాల సిబ్బందికి 010 ద్వారా వేతనాలు అందేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, నాయకులు మురళి, ఎల్లన్న, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మోదీ హయాంలోనే అభివృద్ధి'

లోకేశ్వరం: ప్రధాని నరేంద్రమోదీ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా కోఆర్డినేటర్ సుష్మారెడ్డి అన్నారు. గురువారం లోకేశ్వరంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు జయసాగర్‌రావు, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్, జిల్లా కార్యదర్శి నల్ల రమేశ్, రాజశేఖర్, సంజీవ్, సంతోష్‌పటేల్ తదితరులు ఉన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

నిర్మల్‌చైన్‌గేట్: పేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండగా ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్మల్ పట్టణం, సారంగాపూర్, లక్ష్మణచాంద, సోన్, మామడ మండలాలకు చెందిన 15 మంది పలువురు లబ్ధిదారులకు రూ 5.70 లక్షల విలువైన చెక్కులు అందించారు. కార్యక్రమంలో నిర్మల్ ఏఎంసీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు నాందేడపు చిన్నూ, మాజీ జెడ్పీటీసీలు ఓసా రాజేశ్వర్, రాథోడ్ సంతోష్ సోనియా, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లింగారెడ్డి, సోన్ మండలాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, దేవరకోట చైర్మన్ కొండ శ్రీనివాస్, మండలాల నాయకులు పాల్గొన్నారు.



చెక్కులు అందుకున్నవారితో శ్రీహరిరావు

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన చాకలి లస్మన్నకు రూ.36 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. గురువారం లబ్ధిదారులకు మాజీ సర్పంచ్, బీజేపీ నాయకులు చెన్న మహేశ్ అందజేశారు.

పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలి

కుంటాల: విద్యార్థులు పుస్తకపఠనం అలవర్చుకొని చదువుల్లో రాణించాలని ఎంఈవో ముత్యం పేర్కొన్నారు. గురువారం మండలంలోని లింబా (కె) ప్రాథమిక పాఠశాలలో మోడల్ లైబ్రరీ(గ్రంథాలయం)ని ప్రారంభించి మాట్లాడారు. లైబ్రరీకి వెళ్లి జ్ఞానవంతులుగా మారాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాజేశ్వర్, సతీశ్‌కుమార్, రవీందర్, మాజీ సర్పంచ్‌లు సవ్వి అశోక్‌రెడ్డి, ఆనందరావు పటేల్, మాజీ ఎంపీటీసీ సునంద గిరీశ్, పీఏసీఎస్ డైరెక్టర్ గజ్జారాం, అనిత, వీడీసీ చైర్మన్ ముత్యంరెడ్డి, రూమ్ టు రీడ్ కోఆర్డినేటర్ రాము, రాజు, గౌతం తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయం ప్రారంభిస్తున్న ఎంఈవో ముత్యం

ఉపాధి గ్రామసభ

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. దీనికి ఎంపీడీవో రాధ హాజరై మాట్లాడారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులు గుర్తించి ప్రణాళికలు తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. జాబ్‌కార్డు కలిగిన వారికి 100 రోజులు ఉపాధి కల్పించాలన్నారు. ఉపాధిహామీ పథకం కింద పండ్ల తోటలు సాగుకు ఆసక్తి కల్గిన రైతుల వివరాలు సేకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో ప్రమీల, టీఏ దినేశ్, పంచాయతీ కార్యదర్శి విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో రాధ

'పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం'

నిర్మల్‌ఖిల్లా: పీఆర్టీయూతోనే విద్యారంగ సమస్యలు పరిష్కారమవుతాయని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తోట నరేంద్రబాబు అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీ కళాశాల, మహాత్మ జ్యోతిబాపూలే బాలికల కళాశాలలను గురువారం సందర్శించారు. ఉపాధ్యాయలకు ఫాం–19 పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు, ఉపాధ్యాయ ఏకీకృత సర్వీస్ నిబంధనల సాధన, పెండింగ్ డీఏలు, జీవో 317 తదితర సమస్యల సాధనకు సంఘం తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని పేర్కొన్నారు. సంఘం తరఫున ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బరిలో నిలిచే అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. నిర్మల్ అర్బన్ మండల అధ్యక్షుడు బల్స గజ్జరాం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మునీందర్ రాజు, మండల ప్రధాన కార్యదర్శి సంఘం స్వామి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తు పత్రాలు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

నేడు కంటి వైద్యశిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ హైదరాబాద్ వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం శుక్రవారం ఏర్పాటు చేసినట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పెన్షనర్ల సంఘ భవనంలో ఉదయం 10:30 గంటలకు జరిగే వైద్య శిబిరాన్ని పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఆపరేషన్లు ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు.

కొలువుదీరిన భైంసా ఏఎంసీ పాలకవర్గం



బాధ్యతలు స్వీకరించిన నూతన పాలకవర్గం

భైంసాటౌన్: భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఎట్టకేలకు కొలువుదీరింది. ప్రభుత్వం చైర్మన్, వైస్‌చైర్మన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో గురువారం పట్టణంలోని ఏఎంసీ కార్యాలయంలో చైర్మన్‌గా ఆనంద్‌రావు పటేల్, వైస్‌చైర్మన్‌గా ఫారూక్ అహ్మద్‌తో పాటు సభ్యులుగా డి రామేశ్వర్, భూమన్న, మౌలా మియా, తోట రాము, రాథోడ్ రాంనాథ్, జాదవ్ సురేఖ, గడపాలే దేవిదాస్, సట్ల కిష్టన్న, మాధవ్‌రావు, సుధాకర్ రావు, కుంటోల్ల విఠల్, కదం దత్తురాంలతో ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పూర్యా నాయక్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు. నూతన పాలకవర్గాన్ని పలువురు శాలువాతో సన్మానించారు.

తానూరు మండల కార్యవర్గం ఎన్నిక

తానూరు: మండలకేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తానూరు మండల కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా బద్రె సాయినాథ్, అధ్యక్షుడిగా అంబాదాస్ పవార్, ఉపాధ్యక్షులుగా గంగాధర్, భన్‌సోడే గంగాధర్, నాగోరావ్, కార్యదర్శిగా దయానంద్, సహాయ కార్యదర్శిగా సాయినాథ్ దేవకే, నాగోరావ్, సభ్యులుగా భీమ్‌రావ్, విశ్వనాథ్, గంగాధర్, నాగోరావ్, సురేశ్, బాబురావ్, సాయినాథ్, సోషల్ మీడియా సభ్యులుగా జైభీమ్, మహాశ్, శంకర్, రాహుల్, మానిక్, మాధవ్, దేవరావ్, దిలీప్, గంగాధర్ ఎన్నికయ్యారు. నాయకులు దిగంబర్, శంకర్‌చంద్రే, భీమ్‌పవార్, లక్ష్మణ్ తదితరులున్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

సైలెన్సర్లు మారిస్తే చర్యలు

భైంసాటౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని.. అధిక శబ్దం వచ్చేలా బైక్‌లకు సైలెన్సర్లను మారిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ గోపినాథ్ తెలిపారు. పట్టణంలో అధిక శబ్దం చేస్తూ తిరుగుతున్న ఏడు ద్విచక్రవాహనాలను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహనాలను స్వాధీనం చేసుకొని యజమానులకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించామన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కుంటాల: మండలంలోని కల్లూరులో గురువారం బీడీ కార్మికులకు.. పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితులు ఫోన్ చేసి బ్యాంకు వివరాలు, ఓటీపీలు అడిగితే చెప్పవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్సైలు దేవురావు, రాందాస్, సిబ్బంది పాల్గొన్నారు.